

నేడే పిఠాపురం 18వ వార్డులో అక్షరం అండగా..

మా అక్షరం.. మీ ఆయుధం.. ఇదే ఆంధ్రజ్యోతి నినాదం.. ఆ అక్షరంతోనే జనం చెంతకు వస్తోంది.. ఇప్పటివరకూ అక్షరంతో జనగళమై ఆంధ్రజ్యోతి ప్రశ్నించింది. ఇప్పుడు స్థానిక సమస్యలపై జనవాణి వినిపించేందుకు మంగళవారం నుంచి తొలి అడుగువేస్తోంది.. రండి.. చేయి కలపండి.. సమస్యలు చెప్పండి!

పిఠాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులను ఒకే వేదికపై తీసుకువచ్చి వారి సమక్షంలో ప్రజల సమస్యలను చర్చించి పరిష్కరించే లక్ష్యంతో ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా పిఠాపురంలో మంగళవారం చర్చావేదికను నిర్వహించనున్నారు. పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో ఈనెల 28వతేదీ మధ్యాహ్నం 3.30గంటలకు 18వ వార్డులోని సమస్యలు, ప్రజల ఇబ్బందులు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ చర్చావేదిక జరగనుంది. ప్రజలు, వివిధ వర్గాలు, సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడిస్తే వాటిపై ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు స్పందించేలా ఆంధ్రజ్యోతి కృషి చేయనుంది. ఈ చర్చావేదికలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, పిఠాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి, మునిసిపల్ కమిషనర్ నామా కనకారావు, వార్డు కౌన్సిలరు వంపనబోయిన అన్నపూర్ణ వివిధ విభాగాలు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకానున్నారు. పట్టణంలోని 18వ వార్డు ప్రజలు ఇందులో పాల్గొనాలని ఆంధ్రజ్యోతి కోరుతోంది.

సంఘ విద్రోహ శక్తులపై ఉక్కుపాదం



బాధ్యతలు చేపడుతున్న ఎస్పీ

- ఎస్పీ బింధుమాధవ్
- నూతన ఎస్పీగా బాధ్యతల స్వీకరణ

కాకినాడ క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సమాజానికి హాని తలపెట్టే సంఘ విద్రోహశక్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ జి.బింధుమాధవ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన కాకినాడ జిల్లా నాలుగో ఎస్పీగా వేద మంత్రాల మధ్య బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన విక్రాంత్‌పాటిల్ కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. బింధుమాధవ్ స్వస్థలం విజయవాడ. ఆయన 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ఆయన గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉన్నప్పుడు రంపచోడవరం అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. తాజాగా కర్నూల్ ఎస్పీగా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ బింధుమాధవ్ మీడియాతో మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నియోజకవర్గం తాను పనిచేసే జిల్లాలో ఉన్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతానన్నారు. జిల్లాలో ఉన్న ప్రజలు ఎవరైనా సరే కష్టంలో ఉంటే అపాయింట్‌మెంట్ లేకుండా తనను నేరుగా కలవచ్చన్నారు. ఎస్పీ సతీమణి, అడ్మిన్ ఎస్పీ ఎంజీవీ భాస్కర్ రావు, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాస్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఎస్‌డీపీవోలు పాటిల్, శ్రీహరిరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 364 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో జె.వెంకటరావు, జడ్పీ సీఈవో వి.లక్ష్మణరావు, సెజ్ ఎస్డీసీ కేవీ రామలక్ష్మి, సీపీవో పి.త్రినాథ్, ఇతర అధికారులతో కలిసి జేసీ ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 364 అర్జీలందాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 75 అర్జీలు



అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ బింధుమాధవ్

కాకినాడ క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎస్పీ జి.బింధుమాధవ్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 75మంది అర్జీదారులు సోమవారం పోలీస్‌గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఆయన వెంటనే స్పందించి పోలీస్‌అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయకుమారి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ పీడీగా కె.విజయకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా సీడీపీవోగా పనిచేస్తున్న ఆమె ఐసీడీఎస్ పీడీ ఆఫీసులో నోడల్ అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కాకినాడ జిల్లా పీడీగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

మూడు నెలల్లో మాస్టర్ ప్లాన్ పూర్తి

- కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాస్టర్ ప్లాన్ మూడు నెలల్లో పూర్తవుతుందని కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి తెలిపారు. కౌడా కార్యాలయంలో సోమవారం ఆయన ఎల్టీపీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్డింగ్స్ లేఔట్లపై వచ్చిన కొత్త జీవోలకు అనుగుణంగా ఎల్పీటీలు సపోర్ట్ చేసి గౌడ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులపై లైసెన్సు సర్వేయర్లు దృష్టిపెట్టి వాటిని క్లియర్ అయ్యేలా చూడాలన్నారు. ఎల్టీపీలకు ఏమైనా సమస్యలుంటే స్వయంగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ వి.శ్రీనివాస్, సెక్రటరీ కాశీబాబు, ప్లానింగ్ ఆఫీసర్లు కృష్ణారావు, శివరామకృష్ణ, ఎల్టీపీ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాంబాబు, కెడాయ్ ప్రెసిడెంట్ విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

సైకిల్ సవారీ ఆరోగ్యానికి దారి..



కాకినాడలో సైకిల్ ట్రాక్‌పై సైక్లింగ్..





కాకినాడలో గోదావరి సైకిల్ క్లబ్

కాకినాడలో 2017లో కొంతమంది స్థానికులు ఆరోగ్య సంరక్షణకోసం సైక్లింగ్ చేయడం ప్రారంభించారు. అలా నలుగురితో గోదావరి సైకిల్ క్లబ్ ప్రారంభించారు. ఇప్పుడు 60మంది సభ్యులయ్యారు. ఇందులో ప్రముఖ వైద్యులు, జిల్లాస్థాయి అధికారులు, వ్యాపారస్తులు, మహిళలు కూడా ఉన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ట్రస్ట్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సహా ఇంకా ఎంతోమంది నిష్ణాతులైన వైద్యులు ఈ సైక్లింగ్ క్లబ్‌లో భాగస్వామ్యమై ఉన్నారు. ఇందులో సభ్యులంతా రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 8.30 గంటల వరకు సైక్లింగ్ చేస్తుంటారు. గతంలో కాకినాడ బీచ్ రోడ్డు నుంచి ఉప్పాడ, అద్దరిపేట వరకు సైక్లింగ్ చేసేవారు. ఆ రోడ్డు ఛిద్రమవడంతో కాకినాడ-కత్తిపూడి రహదారిలో గొల్లప్రోలు టోల్‌గేట్ వరకు వెళ్లి వస్తుంటారు. కాకినాడ నుంచి ఒక్కోసారి కురాడ, విరవాడ, కాపవరం ఇలా కాకినాడ పరిసర ప్రాంతాల్లో సైక్లింగ్ చేస్తుంటారు.

కాకినాడలో ప్రత్యేక ట్రాక్‌లు

కాకినాడలో సైక్లింగ్ కోసం జేఎన్టీయూకే నుంచి భానుగుడి వరకూ 3కిలోమీటర్ల మేర, వివేకానంద పార్కు చుట్టూ ఒక కిలోమీటర్ మేర సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. సైక్లింగ్ చేసేందుకు దూరం వెళ్లలేనివారు, సమయం సరిపోని వారు ఈ రెండు ట్రాక్‌ల్లో ఉదయం, సాయంత్రం సైక్లింగ్ సాధన చేస్తున్నారు.

సైక్లింగే కాదు సేవ కూడా..

గోదావరి సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సైక్లింగ్‌తోపాటు పలు అవగాహన కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు సైతం చేపడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటుతున్నారు. పేద విద్యార్థులకు సైకిల్స్, బుక్స్, భోజనం ప్లేట్లు అందించి తోడ్పాటునందిస్తున్నారు. వీటితోపాటు క్యాన్సర్, ఆరోగ్యంపట్ల పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

- సైక్లింగ్‌తో ఆరోగ్యానికి మేలంటున్న వైద్యులు
- కాకినాడలో గోదావరి సైక్లింగ్ క్లబ్ ఏర్పాటు
- 60 మంది వరకు సభ్యులు.. యువకులు, వృద్ధులు, మహిళలు కూడా..
- ప్రతిరోజూ పదుల సంఖ్యలో సైకిల్‌యానం

సైక్లింగ్.. ఉరుకుల పరుగుల జీవితంలో రిలీఫ్‌నిచ్చే వ్యాయామం ఇది.. ఆసక్తి ఉండాలే గానీ సైకిల్ తొక్కితే ఆనందం, ఆరోగ్యం కలిసొస్తాయి. ఒకప్పుడు ఎంత దూరమైనా సైకిల్‌పై వెళ్లి పనులు చక్కబెట్టుకుని వచ్చేవారు.. అలా సైకిల్ తొక్కడంవల్ల ఆరోగ్యంగా ఉండేవారు. ఇదొక వ్యాయామం లాగా ఉపయోగపడి రోజంతా చురుగ్గా ఉండడంతోపాటు వారికి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటారు. కాలక్రమంలో సైకిళ్లను ఉపయోగించేవారు తగ్గారు. విద్యార్థులు, చిన్నారులు తప్ప పెద్దలు ఆ జోలి కెళ్లడం లేదు..

ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్(కాకినాడ)/కాకినాడ రూరల్/జీజీహెచ్(కాకినాడ):

సమాజంలో సైకిళ్లు తొక్కేవాళ్లు తగ్గారు కానీ ఇటీవల కాలంలో కొందరు ఆసక్తి ఉన్న వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి సైక్లింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసి క్లబ్ పేరిట సైక్లింగ్ చేస్తున్నారు. రోజువారీగానే కాకుండా వారాంతాల్లో దూరప్రాంతాలకు సైతం వెళ్తున్నారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ సిటీ, మిగిలిన చోట్ల కూడా ఈ తరహా సైక్లింగ్ చేసేవారు కనిపిస్తుంటారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నారు, వైద్యులు ఉన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు..గృహిణులు కూడా ఉన్నారు..

వేయి కిలోమీటర్లు పూర్తిచేసిన తొలి మహిళను నేనే





నాకు 46 సంవత్సరాలు. నేనో గృహిణిని. గతంలో వాకింగ్ చేసేదాన్ని అనారోగ్య సమస్యలు ఉండడంతో వైద్యుడు సైక్లింగ్ చేయాలని సూచించారు. అనారోగ్యాన్ని జయించడానికి సైక్లింగ్ చేయమని డాక్టర్ ఇచ్చిన సలహా నా జీవితాన్ని మార్చేసింది. నా అనారోగ్య పరిస్థితులు కూడా అధిగమించాను. ప్రారంభంలో రోజుకు 10 నుంచి 20 కిలోమీటర్లు వెళ్లేదాన్ని. తర్వాత పోటీలకోసం కాకినాడ నుంచి అన్నవరం, చేబ్రోలు వెళ్లొచ్చేదాన్ని. సూపర్ రాండోనీర్స్‌ను పూర్తి చేశా. అనంతరం అమరావతి రాండోనీర్ వాళ్లు వెయ్యికిలోమీటర్లు పోటీ నిర్వహించారు. ఇందులో గుంటూరులో మొదలై కరీంనగర్‌కు 75గంటల్లో వెళ్లి రావాలి. ఆంధ్ర రాష్ట్రంలో ఈ రెండూ పూర్తి చేసిన తొలి మహిళను నేనే. హైవే మీద రాత్రిళ్లు భారీ వాహనాలు వెళ్తున్నా ధైర్యంగా పూర్తి చేశా. సైకిల్‌కు పంక్చర్ వేయడం, మరమ్మతులు చేయడం కూడా నేర్చుకున్నా. వచ్చేఏడాది లండన్‌లో నిర్వహించే 1500 కిలోమీటర్ల పోటీలో పాల్గొంటా.

● కోనేరు అనిత, కాకినాడ

3 ఏళ్లలో 36 వేల కి.మీ..



సైక్లింగ్ అలవాటుగా మారింది.. మూడేళ్లలో 36వేల కిలోమీటర్లు సునాయాసంగా తొక్కేశాను. హైదరాబాద్ నాలుగుసార్లు, విజయవాడ ఆరుసార్లు, విశాఖపట్నం ఎనిమిదిసార్లు రైడ్ చేశాను. పారిస్ సంస్థ నిర్వహించిన పోటీల్లో కూడా మెడల్స్ అందుకున్నాను. 600, 300, 200 పూర్తి చేసిన వారిని సూపర్ రాండోనీర్లు అంటారు. పారిస్‌లో నాలుగేళ్లకోసారి నిర్వహిస్తారు. అది నేను నాలుగు సార్లు పూర్తి చేశాను. 1500 కిలోమీటర్ల పోటీకి సిద్ధమవుతున్నా.

-యండమూరి ప్రకాష్‌రావు, కాకినాడ

త్వరగా బరువు తగ్గొచ్చు



సైక్లింగ్ ద్వారా త్వరగా బరువు తగ్గడానికి ఆస్కారం ఉంటుంది. ఇంకా చాలా ఆరోగ్యపరమైన ఉపయోగాలున్నాయి. మంచి శరీరాకృతి ఏర్పడడంతోపాటు మధుమేహం, రక్తపోటు అదుపులోకి వస్తాయి. ఉదయాన్నే సైకిల్ తొక్కడంవల్ల రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది. నేను కూడా 1500 కిలోమీటర్ల పోటీకి సిద్ధమవుతున్నా.

● దేవు రాజేశ్వర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

రాండోనీర్లు.. సూపర్ రాండోనీర్లు..



క్లబ్ సభ్యులు రోజూ 40కిలోమీటర్లు, వారంతాల్లో 100 కిలోమీటర్లకు పైగా సైక్లింగ్‌కి వెళ్తున్నారు. క్లబ్‌లో వేల కిలోమీటర్లు సునాయాసంగా రైడ్ చేసిన సభ్యులు కూడా ఉన్నారు. ఐదుగురు సభ్యులు 200, 300, 600 కిలోమీటర్లు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం సైక్లింగ్ చేసిన సభ్యులు ఉన్నారు. పరిమిత సమయంలో 200 కిలోమీటర్లు దాటి సైక్లింగ్ చేసిన వాళ్లను రాండోనీర్లు అంటారు. వీటిని పలుసార్లు పూర్తి చేసిన వారిని సూపర్ రాండోనీర్లుగా అభివర్ణిస్తారు. కాకినాడలోని గోదావరి క్లబ్‌లో ఈ రాండోనీర్లు, సూపర్ రాండోనీర్లు కూడా ఉన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం



ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుంది. మా వైద్యులం కొందరం కలిసి గోదావరి సైక్లింగ్ క్లబ్‌లో చేరాం. మా గ్రూపులో స్టాన్లీ అనే వ్యక్తి ఆధ్వర్యంలో వృద్ధులు, మహిళలు సైక్లింగ్ చేస్తూ ఆరోగ్యవంతులు అవుతున్నారు. కొవిడ్‌కు ముందు విశాఖపట్నం, విజయవాడ కూడా సైక్లింగ్ చేసి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రతి ఆదివారం బృందంగా వెళ్తుంటాం. సైక్లింగ్ చేయడం వల్ల మోకాళ్లపై ఒత్తిడి పడదు. గుండె పనితీరు మెరుగుపడుతుంది. మొత్తంగా అవయవాల్లో చలాకీతనం వస్తుంది. మా బృందంలో వైద్యులు డాక్టర్ సానా ప్రవీణ్, డాక్టర్ వై.రామకృష్ణ, డాక్టర్ ఆనంద్, డాక్టర్ విజయకృష్ణ, డాక్టర్ వెంకటాచలం, డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ కిరణ్, డాక్టర్ హరీష్ ఉన్నారు.

● డాక్టర్ అరుణాదిత్య, కాకినాడ

జేఎన్‌టీయూకేలో ఐఐఐపీటీ ఆధ్వర్యంలో..

ఫూల్ క్యాంపస్ డ్రైవ్


క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులకు సూచనలిస్తున్న ఐఐఐపీటీ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ

- 120మంది హాజరు కాగా 27మంది ఉద్యోగాలకు ఎంపిక

జేఎన్టీయూకే, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌యూకేలోని సెనేట్‌హాల్లో ఐఐఐపీటీ డైరెక్టరేట్ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఫూల్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. దీనిలో మెకానికల్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) విద్యార్థులకు తిరుచ్చిలోని శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేపట్టిన క్యాంపస్ డ్రైవ్‌కు వర్సిటీ, డిగ్రీ కళాశాలలనుంచి 120మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 27మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు బీటీ కృష్ణ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు దేశంలోని కంపెనీకి సంబంధించిన 35 ప్రాజెక్టుల్లో ఎక్కడైనా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు.

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి హుండీ ఆదాయం రూ.39,02,348


ఆలయంలో స్వామివారి హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కొలువైన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం హుండీల ఆదాయం లెక్కించారు. ప్రధాన ఆలయంలోని హుండీల ద్వారా రూ.38,29,465, గుర్రాలక్కమ్మవారి హుండీ ఆదాయం రూ.16,780, అన్నదాన హుండీ ద్వారా రూ.56,103 మొత్తం హుండీల ద్వారా ఆదాయం రూ.39,02,348 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం 'సోనోవిజన్'లో లక్కీడ్రా ద్వారా విజేతల ఎంపిక


లక్కీడ్రాలో పాల్గొన్న సంస్థ ఎండీ భాస్కరమూర్తి, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జేఎన్‌రోడ్‌లోని సోనోవిజన్ షోరూంలో సోమవారం లక్కీడ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. సంక్రాంతి,రిపబ్లిక్‌డే సందర్భంగా రాజమహేంద్రవరం, కాకినాడ షోరూంల్లో కొనుగోళ్లు చేసిన కస్టమర్లకు ఏర్పాటు చేసిన ఈ డ్రా కార్యక్రమానికి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లక్కీ డ్రాలో మొదటి బహుమతి మారుతి ఆల్టోకారును పిఠాపురానికి చెందిన ఎస్.అన్నపూర్ణ గెలుచుకోగా రెండో బహుమతి ఎల్ఈడీ టీవీని రాజమహేంద్రవరానికి చెందిన కె.చైతన్య, మూడో బహుమతి రిఫ్రిజిరేటర్‌ను రాజమహేంద్రవరానికి చెందిన అఖిల్‌కుమార్, నాలుగో బహుమతి వాషింగ్ మెషీన్‌ను కాకినాడకు చెందిన అల్లం కుమార్ గెలుపొందారు. సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి మాట్లాడుతూ తమసంస్థ ద్వారా తక్కువ ధరల్లో నాణ్యమైన గృహోపకరణాలను అందిస్తూ నమ్మకమైన సర్వీసు ఇవ్వడంలో ముందంజలో ఉన్నామన్నారు.

అన్నవరం దేవస్థానంలో..

ఆదాయం పెంపు, వ్యయాల తగ్గింపుపై ప్రత్యేక కమిటీ

- అన్ని విభాగాల ఏఈవోలు, నలుగురు సూపరింటెండెంట్, సహాయ కమిషనర్‌తో కమిటీ
- దేవస్థానంలో ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి అతలాకుతలం

అన్నవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానంలో ఆర్థిక పరిస్థితి అతలాకుతలంగా మారడంతో ఈవో వీర్ల సుబ్బారావు ప్రత్యేక కమిటీని నియమించారు. సహాయ కమిషనర్, అన్ని విభాగాల ఏఈవోలు, నలుగురు సూపరింటెండెంట్‌లతో ఈ కమిటీని నియమించారు. వీరంతా దేవస్థానం ఆదాయం పెంపు, వ్యయాల తగ్గింపుపై విశ్లేషణ చేసి ఒక నివేదికను తయారు చేసి ఇవ్వాలని, దీన్ని దేవదాయ కమిషనర్ అనుమతితో అమలు చేసేలా ఆలోచన చేస్తున్నారు. దేవస్థానానికి ఏటా రూ.170కోట్లు ఆదాయం వస్తున్నా సిబ్బంది జీతాలు, పెన్షన్ల రూపంలో రూ.80కోట్లు ఖర్చవుతుంది.ఇక ప్రసాదం తయారీ, వ్రతవిభాగంలో, ఇతర విభాగాలకు అవసరమైన రసవర్గాల కొనుగోలు, శానిటేషన్ నిర్వహణ, ఇంజనీరింగ్ విభాగాల పనులతో ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగియకుండానే ఖర్చులు బడ్జెట్‌ను మించిపోయి సప్లమెంటరీ బడ్జెట్ అనుమతికోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా గతేడాది రూ.4కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను విత్‌డ్రా చేసి వినియోగించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదేవిధంగా ఉంటే భవిష్యత్‌లో జీతాలు, పెన్షన్లను సకాలంలో చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో అప్రమత్తమైన ఈవో ఈ నిర్ణయం తీసుకున్నారు. వారంరోజుల్లో నివేదికను సమర్పించాలని కోరినా అధ్యయనం, నివేదిక తయారీకి ఇంకా సమయం పట్టువచ్చునని అధికారులు పేర్కొంటున్నారు.

మాజీ సైనికుల సమస్యలపై రేపు 'స్పర్శ'

- రాజమహేంద్రవరంలో కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని మాజీ సైనికుల సమస్యలపై ఈనెల 29న రాజమహేంద్రవరం హోటల్ రివర్‌బేలో స్పర్శ ఔట్‌రీచింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కెప్టెన్ పి.సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అలహాబాద్ సీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు, మాజీ సైనిక సంఘాల వారంతా తమ సమస్యలు తెలపవచ్చన్నారు. బ్రిగేడియర్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వెంకటరెడ్డి హాజరై సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు.

నూతన దేవదాయ కమిషనర్‌ను కలిసిన అన్నవరం వ్రతపురోహిత సంఘం


కమిషనర్‌ను కలిసిన దేవస్థానం వ్రతపురోహిత సంఘ నాయకులు

అన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దేవదాయ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.రామచంద్రమోహన్‌ను అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి వేదాశీర్వచనాలు అందజేశారు. అన్నవరం దేవస్థానంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్రతపురోహిత వ్యవస్థను 2010లో రామచంద్రమోహన్ ఈవోగా వ్యవహరించిన సమయంలో ప్రక్షాళన చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు, ఉద్యోగవిరమణ పురోహితులకు పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించారు. దీంతో వారికి ఆయనతోప్రత్యేక అనుబంధం ఏర్పడింది. ఈ సందర్భంగా రామచంద్రమోహన్ అన్నవరంలో వ్రతవిభాగం చాలా కీలకమైనదని, ఆలయ ప్రతిష్ఠ కాపాడేందుకు వ్రతపురోహితులు పాటుపడాలని సూచించారు. వ్రతపురోహిత సంఘ అధ్యక్షులు చామర్తి కన్నబాబు, మొకరాల రాజేష్, మంథా రాంబాబు గురుమూర్తి తదితరులున్నారు.

875 కిసాన్ డ్రోన్లతో యాంత్రీకరణ కేంద్రాలు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడులు తగ్గించడానికి, పంటలకు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడానికి ఈఏడాది 875 కిసాన్ డ్రోన్లతో గ్రామస్థాయి యాంత్రీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. రూ.10లక్షల విలువైన ఒక్కో యూనిట్‌కు 80% సబ్సిడీ, 50% బ్యాంక్ లోన్, రూ.70 కోట్ల రాయితీతో ఏర్పాటు చేస్తామని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అద్దె ప్రాతిపదికన ఈ యంత్ర సేవలు అందించడానికి 4-5మందితో రైతు సంఘాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

కుష్ఠురహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- డీఆర్వో టి. సీతారామ్మూర్తి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్వో

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాను కుష్ఠురహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని డీఆర్వో టి.సీతారామ్మూర్తి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించే స్పర్శ కుష్ఠువ్యాధి అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఆర్వో మాట్లాడుతూ కుష్ఠువ్యాధిగ్రస్తుల పట్ల ప్రజల్లో వివక్ష లేకుండా చూడాలన్నారు. జిల్లా కుష్ఠు నియంత్రణ అధికారిణి డాక్టర్ వసుంధర, అధికారులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన శిబిరం ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ) జనవరి 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ భరోసా-దివ్యాంగుల పెన్షన్ పథకంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుతం పెన్షన్‌కు అర్హులైన లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన శిబిరాన్ని కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో సోమవారం ప్రారంభించారు. దృష్టిలోపం, వినికిడి లోపం, మానసిక వికలాంగులకు సంబంధించి ఆయా విభాగాల ద్వారా ఈ క్యాంప్‌నకు సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని ఆస్పత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. ప్రతి విభాగానికి ఇద్దరు వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొంటారన్నారు. సదరం కేంద్రంలోకి వెళ్లి ఆధారు కార్డు ద్వారా ఓపీ చీటి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కలర్ కోటెడ్ చీటీని తీసుకోవాలన్నారు. కంటి విభాగం కోసం గులాబీ రంగు టోకెన్, ఈఎన్‌టీ విభాగం కోసం ఆకుపచ్చ టోకెన్, సైక్రియాట్రీ విభాగంకోసం నీలం టోకెన్ తీసుకుని సంబంధిత వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, సైకియాట్రీ వైద్య నిపుణులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ యమున పాల్గొన్నారు.

30 నుంచి భావనారాయణస్వామి తిరునాళ్లు

సర్పవరంజంక్షన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 30 నుంచి మాఘమాస మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం సర్పవరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 23 వరకు మాఘమాస మహోత్సవాలు జరుగుతాయని, ఇందులోభాగంగా నాలుగు ఆదివారాలు భావనారాయణస్వామి తిరునాళ్లు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 2న మొదటి ఆదివారం తిరునాళ్ల, 4న రథ సప్తమి వేడుకలు, 8న భీష్మా ఏకాదశి, 9న రెండో ఆదివారం తిరునాళ్ల, 12న మాఘ పౌర్ణమి, 16న మూడో తిరునాళ్ల, 23న నాలుగో తిరునాళ్ల నిర్వహించేందుకు భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నాలుగు ఆదివారాల్లో జరిగే తిరునాళ్లకు వేలాదిమంది భక్తులు స్వామవారిని దర్శించుకునే అవకాశం ఉందని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సాగు చేసుంటే బాగు!



గన్నవరంలో ఆరబెట్టిన మిర్చి పంట

- ఏజెన్సీలో మిర్చికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల ఆసక్తి
- ఈ ఏడాది ఆశాజనకంగా మిర్చి సాగు
- ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి
- ఎక్కువ పంట వేసుంటే ఆదాయం పెరిగే అవకాశం

ఎటపాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో గత మూడేళ్ల నుంచి వరుస నష్టాలను చవిచూస్తున్న మిర్చి రైతులు ఈ ఏడాది మక్కువ చంపుకుని మిర్చికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ఆసక్తి చూపారు. ప్రధానంగా లంక పొగాకు, మినుము, మొక్కజొన్న, జామాయిల్ సాగు బాట పట్టారు. అయితే ప్రస్తుతం మిర్చి దిగుబడి బాగున్నా సాగు అంతంత మాత్రమే ఉంది. గత మూడేళ్లుగా మిర్చి పంటకు నల్లితామర పురుగు, వైరస్ ప్రభావంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. కనీసం పెట్టుబడులు కూడా రాక రూ.లక్షల్లో నష్టాలు మూట గట్టుకున్నారు. దాంతో ఏజెన్సీలో ఈ ఏడాది మిర్చి రైతులు పంట సాగుకు సాహసించని పరిస్థితి. గతేడాది ఎటపాక మండలంలో 3,300 ఎకరాల్లో మిర్చిపంట సాగు చేయగా, ఈ ఏడాది కేవలం 1,800 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేశారు. ఏజెన్సీలో గతంలో పది నుంచి పదిహేను ఎకరాల వరకు సాగు చేసిన మిర్చి రైతులు నష్టాలతో ఏడాదికి కేవలం 2, 3 ఎకరాల్లో మాత్రమే పంటను సాగు చేశారు. ఎకరం సాగుకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు అయినట్టు రైతులు పేర్కొంటున్నారు.

వ్యాపించని వైరస్‌లు

అయితే ఈ ఏడాది పంటకు నల్లితామర పురుగు ఆశించలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఎలాంటి వైరస్‌లు వ్యాపించ లేదని, దాంతో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందంటున్నారు. ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పంట ఆశాజనకంగా ఉంది



గత ఏడాది 12 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. రూ 12 లక్షలు నష్టపోయా. ఈ ఏడాది కేవలం 3 ఎకరాల్లో సాగు చేశాను. పంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

వల్లభనేని కిషోర్‌కుమార్, రైతు, గన్నవరం

ఏజెన్సీలో గత వారం రోజుల నుంచి మిర్చి కోతలు నిర్వహిస్తున్నారు. అయితే జనవరి మొదటి వారంలో క్వింటా మిర్చి 15వేల వరకు ధర పలికి, ఆ తర్వాత తగ్గింది. ధర పడిపోవడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ప్రస్తుతం మిర్చి పంట కిలో రూ.120 నుంచి రూ.130 వరకు పలుకుతోంది. ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుంటే బాగుండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అమలాపురంలో దొంగలు బీభత్సం

- ఆంధ్రజ్యోతి కార్యాలయంలో సామగ్రి ధ్వంసం.. నగదు అపహరణ
- పక్కనే ఉన్న చాందిని క్లినిక్‌లో చోరీ
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్



ఆంధ్రజ్యోతి కార్యాలయంలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

అమలాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణ నడిబొడ్డు గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు పడ్డారు. కార్యాలయంలో ఉన్న బీరువాను బద్దలు గొట్టి రూ.85వేల నగదును అపహరించుకుపోయారు. పక్కనే ఉన్న మరో క్లినిక్‌లో కూడా దొంగలు చొరబడి నగదు అపహరించుకుపోయారు. అమలాపురం పట్టణ టౌన్ పోలీసుస్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఈ రెండు భవనాల్లోను దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. ఆంధ్రజ్యోతి కార్యాలయం ప్రధాన ద్వారం తాళాలను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించారు. కార్యాలయంలో ఉన్న ఇనుప బీరువా తలుపులు ధ్వంసం చేసి లోపల సీక్రెట్ లాకరులో ఉన్న అడ్వర్‌టైజ్‌మెంట్‌కు సంబంధించిన నగదు రూ.85వేలను దోచుకువెళ్లారు. బీరువాలో ఉన్న సామాను అంతా చిందరవందరచేసి సామగ్రిని ధ్వంసం చేశారు. అదేవిధంగా కార్యాలయానికి పక్క భవంతిలో ఉన్న చాందిని క్లినిక్ షట్టర్ తాళాలు పగులకొట్టి లోనికి వెళ్లిన దొంగలు డ్రాయర్‌ను ధ్వంసం చేసి వాటిలో ఉన్న సుమారు రూ.35వేల నగదును అపహరించుకుపోయారు. ఈ దొంగతనాలు పోలీసు స్టేషన్‌కు ఎదురుగానే జరగడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 2రోజుల క్రితం సెంటర్‌లోనే ఉన్న పూలరంగడు షాపులో కూడా దొంగతనం జరిగింది. ఇలా పట్టణ నడిబొడ్డు అయిన సెంటర్‌లోనే దొంగలు రెచ్చిపోయి దోపిడీలకు పాల్పడుతున్న తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ ఎ.వెంకటేశ్వరరావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ కార్యాలయాన్ని పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, క్లూస్‌టీమ్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్‌తో క్రైమ్ సీఐ

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

కొవ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో బ్రాహ్మణ రేవు గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 మధ్య ఉంటుందన్నారు. ఆరికిరేవుల వీఆర్వో ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



గోదావరి నదిలో పోలీసులు గుర్తించిన మృతదేహం

దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

తునిరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను కాకినాడ జిల్లా తుని రాజా గ్రౌండ్‌లో సోమవారం వాలీబాల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బోడపాటి శివదత్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే తమ ముందున్న లక్ష్యం అని శివదత్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు అంగదుర్గాప్రశాంతి మాట్లాడుతూ పారా వాలీబాల్ 4వ విడత రాష్ట్రస్థాయి పోటీలను తునిలో ప్రారంభించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. దీని ద్వారా దివ్యాంగులలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు తుని చేరుకున్నారు. ఈ పోటీలు మూడురోజుల పాటు జరగనున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ వి.వేణు, అసోసియేషన్ సెక్రటరీ సీహెచ్.గణేష్, జాయింట్ సెక్రటరీ డి.స్వరూప్, ట్రెజరర్ జెఎన్ సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తునిలో దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన స్వేచ్ఛ నాటికలో ఓ సన్నివేశం

పెద్దాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లిలో 3 రోజులపాటు నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక నిలిచింది. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, జీవీఆర్.స్వామి, డి.రాధాకృష్ణ వ్యవహరించారు. విజేతలను కమిటీ తరుపున జీఎస్ఆర్.స్వామి ప్రకటించారు. ద్వితీయ ఉత్తమ నాటికగా మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇది రహదారి కాదు నిలిచింది. ఉత్తమ నటులుగా స్వేచ్ఛ నాటికలో నటించిన ఆనంద్, గోకాడ వెంకట్, ఉత్తమ నటిగా రాత నాటికలో నటించిన వాగ్దేవి, ఉత్తమ రచయితగా ఆకురాతి భాస్కర్, ఉత్తమ దర్శకుడిగా బీఎస్.రెడ్డి, రంగాలంకరణకు ఫణి, ఆహార్యంకు పి.వేశన, సంగీతం అవార్డులు సురభి నాగరాజుకు దక్కాయి. కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, గౌరవాధ్యక్షుడు ఇందన బ్రహ్మానందం, కొత్తిం స్వామినాథన్, పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి

- గుర్తించిన 51వ విచారణ కమిటీ
- పొలం లేకపోయినా, చనిపోయిన వారి పేర్లు మీద సొమ్ములు డ్రా చేసిన సొసైటీ అధికారులు
- అధికారులను నిలదీసిన రైతులు



అధికారులను నిలదీస్తున్న రైతులు

కిర్లంపూడి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.104 కోట్ల 18 లక్షల 10వేల 572 అవినీతి జరిగినట్టు 51వ విచారణ కమిటీ గుర్తించిందని సొసైటీ అధికారులు వెల్లడించారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో సోమవారం సొసైటీ ఆవరణలో జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ సీఈవో పంపన వెంకటరమణ అధ్యక్షతన కోపరేటివ్ సొసైటీ పర్సనల్ ఇన్‌చార్జి ఎం.రంగనాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు. సీఈవో వెంకటరమణ మాట్లాడుతూ రైతులపై ఏఒక్క రూపాయి భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతులు అధికారులను నిలదీస్తూ వ్యవసాయ భూమి లేని వారికి కూడా రుణాలు ఇచ్చినట్టు లక్షలాది రూపాయిలు చూపించడం, అలాగే చనిపోయిన వారిపేర్లపై రుణాలు తీసుకుని సొసైటీ చుట్టూ రైతులను తిప్పారని గగ్గోలు పెట్టారు. అలాగే 51 ఎంక్వైరీ విచారణ కమిటీ పేరు చెప్పి 18 నెలలు సాగదీశారన్నారు. బూరుగుపూడి, సింహాద్రిపురం, కిర్లంపూడి, జగపతినగరం రైతులు రాజకీయం జోక్యం ఉద్యోగుల బరితెగింపుతో సొసైటీలో అక్రమాలు శృతి మించాయన్నారు. రైతులను మోసంచేసి అడ్డదారిన కోట్లు కొల్లగొట్టారన్నారు. ఇకనైనా వారిపై చర్యలు తీసుకుని సొమ్ములు రికవరీ చేయాలన్నారు. దీనిపై పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి కె.పద్మ విచారణ జరిపి కాకినాడ జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణకు నివేదిక అందించడం జరిగిందన్నారు. ఈ మహాజనసభ నిర్వహించిన నేపథ్యంలో ప్రత్యేకాధికారి సహకార రిజిస్ట్రార్ రంగనాయకులు వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి నగదు నిల్వలో తేడాలు, జీతాల బకాయిల చెల్లింపుల్లో అక్రమాలు వెలుగు చూశాయన్నారు. డిపాజిట్లు, చెల్లింపులు వంటివి బకాయిలు వసూలు చేసిన రశీదు పుస్తకంలో నమోదు చేయలేదన్నారు. సీఈవో వెంకటరమణ మాట్లాడుతూ కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ స్వర్గీయ ఏ.సూర్యకుమారి, కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ సీహెచ్ రాజ్‌కుమార్, ప్రత్తిపాడు డీసీసీ బ్రాంచ్ మాజీ మేనేజర్ మురళీకృష్ణ, వైవీఎస్ నాగేశ్వరరావు, డీసీసీబీ ప్రత్తిపాడు సూపర్‌వైజర్ వివివిడీఆర్ ప్రసాద్,జేవీ మోహనరావు, ఎం.నరసింహామూర్తిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. రైతులకు ఇచ్చిన రుణాలు రూ. ఎనిమిది కోట్లు వసూలు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపిందని మొత్తం రూ.30 కోట్లు ఇంకా రికవరీ కావాల్సి ఉండగా, వాటిని వసూలు చేస్తామని చెప్పడంతో రైతులు ఒక్కసారిగా రుణమాఫీ చేసి తీరాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ తీర్మానం కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

మావోయిస్టు నేత చందన మిశ్రా అరెస్టు



చందన మిశ్రా (ఫైల్)

చింతూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ దండ కారణ్య నాయకుడు చందన మిశ్రా అలియాస్ నగేష్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతూరు ఎస్‌ఐ పేరూరి రమేష్ తెలిపిన వివరాలివి.. తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన చందన మిశ్రా 2018లో మావోయిస్టుల్లో చేరాడు. అనతికాలంలోనే పార్టీలో అంచెలంచెలుగా ఎదిగాడు. 2018లో చందన మిశ్రాను చింతూరు డివిజన్ ఎటపాక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం జైలు నుంచి వచ్చాక కూడా మావోయిస్టుల కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నాడు. దీంతో తిరిగి చింతూరు పోలీసులు ఈనెల 25న అదుపులోకి తీసుకొని సోమవారం మరోసారి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

రేపు పిఠాపురంలో నృత్యకళా ప్రదర్శన

పిఠాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న పిఠాపురంలో పశ్చిమబెంగాల్ సంప్రదాయ జానపద నృత్యరూపకం పురూలియా చౌ నృత్యకళా ప్రదర్శన జరగనుంది. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలోని పీఠికాపుర కళావేదికపై ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు సంగమేశ్వర సంగీత సమాఖ్య ప్రతినిధులు తెలిపారు.

డీమార్ట్‌లో కాలం చెల్లిన సరుకుల విక్రయం

- ఆందోళనకు దిగిన బాధితులు



ఆందోళన చేస్తున్న యువకులతో మాట్లాడుతున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట డీ మార్ట్ వద్ద సోమవారం గందరగోళం నెలకొంది. కొంతమంది వినియోగదారులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే ఆదివారం రోజున కిషోర్ కుమార్ అనే వ్యక్తి వచ్చి 40 ఫ్రూటీ డ్రింక్స్ కేసును తీసుకున్నాడు. దాన్ని ఇంటికి తీసుకుని వెళ్లి పిల్లలతో కలిపి తాగారు. తీరా ప్యాక్‌ను పరిశీలిస్తే ఈనెల 8వ తేదీతో కాలపరిమితి ముగిసి ఉంది. దీంతో ఏదైనా జరుగుతుందేమోనని భయపడి రాత్రి 10 గంటల ప్రాంతంలో వ్యాపారసంస్థ వద్దకు వచ్చినప్పటికీ మేనేజర్ పట్టించుకోలేదు. దీంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేశారు. సోమవారం వారు వచ్చి ఆ వ్యాపార సంస్థలోని సామాన్లు పరిశీలిస్తే ఆ డ్రింక్‌కు సంబంధించి కాలపరిమితి ముగిసినవి లేవని నిర్ధారించారు. ఇంతలో ఆ డ్రింక్ తాగిన వారిలో ఇద్దరికి పెదవుల్లో తిమ్మిర్లు వచ్చాయని, మరో ఇద్దరు పిల్లలకు విరేచనాలు అయ్యాయని బాధితులు చెబుతున్నారు. దీంతో వారంతా ఆందోళన చేయడంతో బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీమార్ట్ మేనేజర్‌ను అదుపులోనికి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

వ్యక్తిపై దాడి కేసులో వైసీపీ నేతపై కేసు

సర్పవరం జంక్షన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి కేసులో వైసీపీ నేత కడియాల చిన్నపై సోమవారం సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గైగోలుపాడుకి చెందిన పెంకే శివపై అదే ప్రాంతానికి చెందిన చిన్నతోపాటు మరో ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర గాయాలపాలైన సదరు వ్యక్తి ఆదివారం రాత్రి చికిత్స కోసం జీజీహెచ్‌లో చేరాడు. అక్కడి అవుట్ పోస్ట్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు శివ ఫిర్యాదు మేరకు చిన్నతో పాటు కడియాల సత్తిబాబు, పాలిక శ్రీను, అంజిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఫ్లెక్సీ చించివేతపై జరిగిన కొట్లాటలో దాడి జరిగింది.

తొండంగిలో గ్యాస్ సిలిండర్లు చోరీ

అన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తొండంగి వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. 96 నిండు సిలిండర్లు అపహరణకు గురైనట్టు నిర్వాహకుడు వడ్డాది ప్రసాద్ పేర్కొన్నాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు.

7 నుంచి బంగారు పాప ఉరుసు ఉత్సవాలు

కొత్తపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఏడో తేదీ నుంచి తొమ్మిది వరకు కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ బషీర్‌బీబీ ఔలియా(బంగారుపాప) 70వ ఉరుసు ముబారక్ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు స్థానికము జావర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు రానున్నారు.

'29లోపు అర్హత గల ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలి'

కాకినాడ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాణీలక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశీలన- ఆత్మరక్షణ కార్యక్రమంలో భాగముగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని బాలికా విద్యార్థుల శిక్షణ కార్యకలాపాల అమలు కోసం అర్హత గల ఏజెన్సీల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష ఏపీసీ పి.వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 లోపు కాకినాడ సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలని ఏపీసీ సూచించారు. ఇతర వివరాలకు ఎస్ఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భార్యను ఆసుపత్రిలో చేర్పించి వస్తుండగా.. మార్గ మధ్యలో ఫిట్స్‌తో భర్త మృతి



అప్పారావు మృతదేహం

అనపర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న భార్యను ఆసుపత్రిలో చేర్పించి తిరుగు ప్రయాణమైన భర్త మార్గ మధ్యలో మృతి చెందిన సంఘటన సోమవారం అనపర్తిలో చోటుచేసుకుంది. అనపర్తి అడిషనల్ ఎస్‌ఐ దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం చిన పొలమూరుకి చెం దిన వల్లం అప్పారావు(52) మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే అనారోగ్యం పాలైన తన భార్యను ఆసుపత్రిలో చూపించేందుకు సోమవారం రాజమహేంద్రవరం వెళ్లాడు. అక్కడి వైద్యులు ఆమెను ఆసుపత్రిలో ఉంచాలని చెప్పడంతో భార్యను ఆసు పత్రిలో చేర్పించి ఇంటికి పయనమ య్యాడు. ఇంతలో అనపర్తి శివారు లోని హీరో హోండా షోరూమ్ సమీపానికి వచ్చేసరికి ఫిట్స్ రావడంతో అప్పారావు మోటార్ సైకిల్‌ను ఆపి కల్వర్టుపై కూర్చునే ప్రయత్నం చేశా డు. అప్పటికే తీవ్రత ఎక్కువ కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్‌ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం కావాలి



పినపళ్లలో భర్త ఇంటి ముందు ధర్నా చేస్తున్న మహిళ

- భర్త ఇంటి ముందు భార్య ధర్నా

ఆలమూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం కావాలంటూ ఓ మహిళ భర్త ఇంటి ముందు ధర్నాకు దిగింది. వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పినపళ్లకి చెందిన ఇల్లూరి రవికుమార్‌కు మండపేట మండలం ఏడిదకి చెందిన ఇళ్ల సత్యవతికి మూడేళ్ల క్రితం వివాహమైంది. అయితే వీరి కాపురం ఆరునెలలు సజావుగానే సాగినప్పటికీ.. అనంతరం విభేదాలు తలెత్తడంతో విడిపోయారు. అప్పటి నుంచి పలుమార్లు పెద్దల సమక్షంలో సర్దిచెప్పినా కాపురానికి తీసుకురావడానికి రవికుమార్ నిరాకరించాడు.దీంతో సత్యవతి భర్త ఇంటి ముందు సోమవారం ధర్నా చేసింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎం.అశోక్ మహిళా పోలీసును పంపించి వివరాలు సేకరించారు. అప్పటికే రవికుమార్ ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోయినట్టు తెలిసింది.

డీటీసీపీవోగా ఎస్.రాజు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళిక అధికారిగా ఎస్.రాజు బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన గుంటూరు జిల్లా నుంచి బదిలీపై విచ్చేస్తున్నారు. ఇప్పటివరకు డీటీసీపీవోగా విధులు నిర్వహించిన ఎ.సత్యమూర్తి ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బదిలీ అయ్యారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్

పిఠాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ హెచ్చరించారు. పిఠాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, వాటి పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సీఐ, ఎస్ఐలతో మాట్లాడి ఇక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. కళాశాలలు, పాఠశాలలు, బస్టాపుల వద్ద నిఘా ఏర్పాటు చేశామని, మఫ్టీలో ఉన్న సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించి అకతాయి చేష్టలకు పాల్పడే వారిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామని వివరించారు. గంజాయి విక్రయాలు, తాగేవారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాత్రివేళల్లో గస్తీ మరింత పటిష్టం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏఎస్పీ వెంట ట్రైనీ ఎస్పీ సుస్మిత, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్, అడిషనల్ ఎస్ఐ జానీభాషా తదితరులు ఉన్నారు.



పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్

రూరల్ పోలీసుస్టేషన్ తనిఖీ

పిఠాపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌ను ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యాకలాపాలు, ఈవ్‌టీజింగ్, గంజాయి విక్రయాలపై నమోదైన కేసులు, అవి గతంలో ఎక్కడ జరిగాయి. వాటి నిరోధానికి ఏమి చర్యలు తీసుకున్నారు తదితర అంశాలపై సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్‌లతో సమీక్షించారు.

చొల్లంగి తీర్థానికి బందోబస్తు

కరప, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బుధవారం జరిగే చొల్లంగి అమావాస్య తీర్థానికి వేలాది భక్తులు రానున్న దృష్ట్యా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. కరపమండలం ఉప్పలంకలో సోమవారం ఆయన పర్యటించి చొల్లంగి తీర్థం ఏర్పాట్లను పరిశీలించారు. సంగమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. భక్తులు స్నానాలు చేసే ఘాట్‌ల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ముందు రోజు నుంచి యానాం జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలను వేరే రూట్ల ద్వారా మళ్లించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాకినాడరూరల్ సీఐ చైతన్య కృష్ణ, ఎస్ఐ తోట సునీత తదితరులు ఉన్నారు.

రాజ్యాంగంపై గౌరవ భావాన్ని పెంపొందించాలి



పెద్దాపురం సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన

పెద్దాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై గౌరవ భావాన్ని పెంపొందించాలని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. బీజేపీ నేత గోరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తాళ్లూరివారి సత్రంలో నిర్వహించిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగం నిర్దేశించిన విలువలపై అవగాహన కల్పించి మరింత గౌరవాన్ని పెంపొందించాలన్నారు. బీజేపీ నేతలు మాలకొండయ్య, దుర్గా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: రాజ్యాంగ విలువలను కాపాడుతున్నది ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తెలిపారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో జరిగిన సంవిధాన్ గౌరవ్ దివస్‌లో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేలా కృషి చేద్దామని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విశ్వనాధపల్లి శ్రీనివాస రాజు, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, బీజేపీ పట్టణాధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, పసుపులేటి సత్యనారాయణ, బుర్రి మురళీధరరావు, బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, తోట ఏడుకొండలు, రవణం సుబ్రహ్మణ్యం, చిట్టా మధు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన యండపల్లి వైసీపీ ఉప సర్పంచ్



చిన్నారావుకు టీడీపీ కండువా కప్పి స్వాగతిస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

కొత్తపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యండపల్లి వైసీపీ ఉప సర్పంచ్ గుండ్ర చిన్నారావు 100మంది కార్యకర్తలతో టీడీపీలోకి చేరారు. చిన్నారావుకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరగకపోవడంతో కూటమి ప్రభుత్వ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుండడంతో ఆకర్షితుడనై టీడీపీలో చేరినట్లు చిన్నారావు తెలిపారు. పీబీసీ డీసీ-2 చైర్మన్, టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి చిన్నారావు, టీడీపీ నాయకులు స్వామిరెడ్డి అప్పలరాజు, బండి నాగేంద్ర పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వరం చొరవ

కాకినాడ కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 27(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ఇచ్చే సమస్య అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి 15మంది ఫోన్ చేసి తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వివిధ సమస్యలపై 32కి పైగా అర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, కార్పొరేషన్ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్వో శైలజ పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న కమిషనర్

పలు ప్రాంతాల్లో పర్యటన

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సోమవారం తెల్లవారుజామునుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా నగరంలో బాలాజీచెరువు సెంటర్‌లో డంపర్ బిన్లను పరిశీలించారు. ఏడో సర్కిల్ జగన్నాథపురంలోని అన్నమఘాటీ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని లేకుండా చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

'పాడా'కు 17 పోస్టులు మంజూరు

పిఠాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారటీకి(పాడా) 17 పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ సోమవారం రాత్రి జీవో నెంబరు 1 జారీ చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గమైన పిఠాపురం అభివృద్ధి లక్ష్యంగా పాడా ఏర్పాటుకు, పోస్టుల మంజూరుకు మంత్రివర్గ ఆమోదం పొందారు. దీనికి అనుగుణంగా 17 పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పాడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఏపీ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి లేదా ఆర్డీవోగా పనిచేసిన సీనియర్ డిప్యూటీ కలెక్టర్ పోస్టును, డీఎల్‌డీవో లేదా ఎంపీడీవో ఒకరిని, ఒక తహశీల్దారు, ఇద్దరు వంతున సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు వంతున డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పీఎంయూ స్టాఫ్, వాచ్‌మెన్లు, ఆఫీసు సబార్డినేట్లు నాలుగు పోస్టులు మంజూరు చేశారు. పీడీ, డీఎల్‌డీవో లేదా ఎంపీడీవో, తహశీల్దారు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను రీడిప్లాయిమెంట్ ద్వారా ప్రస్తుతం సర్వీసులో ఉన్న వారిని నియమించాలని, మిగిలిన వాటిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయాలని ఆ ఆదేశాల్లో నిర్దేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఠాపురంలో పాడా కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

పాఠశాల వార్షికోత్సవం

గొల్లప్రోలు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాలకు మలిరెడ్డి వెంకట్రాజు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. గొల్లప్రోలులో డాక్టర్ మలిరెడ్డి వెంకట్రాజు మెమోరియల్ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం, డాక్టర్ వెంకట్రాజు స్మారక సభను నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత జోనల్ మేనేజరు రెడ్ల శేషగిరిరావు, విద్యాకమిటీ చైర్మన్ కృష్ణవేణి, డాక్టర్ ఎంవీఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ పబ్బినీడి రఘునాథ్, డాక్టర్ పసుపులేటి మధుసూదన్, కుర్రు నారాయణరావు, మలిరెడ్డి సత్యనారాయణ, రేలంగి హైమావతి, డాక్టర్ పసుపులేటి అవంతి, సకురు ఉమాంబ, రెడ్ల రాజేశ్వరీ, మొగలి సుభద్ర, రేఖ, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, మలిరెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

పెద్దాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదర్ థెరిస్సా కాలనీలో నివసిస్తున్న నిరుపేదలకు టూనైట్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ (ఏలేశ్వరం) సమకూర్చిన నిత్యావసర సరుకులను కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. నిరుపేదలకు స్వచ్ఛంద సంస్థలు తమ సహాయసహకారాలను విరివిగా అందజేయాలని పిలుపునిచ్చారు. సూరిబాబు రాజు, టూ నైట్ మినిస్ట్రీస్ ప్రతినిధి జాన్ పీటర్,వరుపుల తమ్మయ్యబాబు పాల్గొన్నారు.

మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నిరసన

గొల్లప్రోలు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే నాడు పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు జరుపడంపై మద్యపాన వ్యతిరేక ప్రచార, పోరాట కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిటీ ప్రతినిధులు సోమవారం గొల్లప్రోలు ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కమిటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ డాక్టర్ సూర్యనారాయణ, కమిటీ ప్రతినిధులు వేమగిరి తరుణ్, గుర్రాల ప్రసాద్,కరణం విశ్వనాథం తదితరులున్నారు.

అధికారులకు అవార్డులు

కాకినాడ సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో అందించిన సేవలకుగాను కాకినాడలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ షాన్‌మోహన్ నుంచి కాకినాడ తహశీల్దార్ వి.జితేంద్ర జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా అధికారి అవార్డు అందుకున్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో అందించిన సేవలకుగాను విజయవాడలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నుంచి కాకినాడ వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా అధికారి అవార్డు అందుకున్నారు.



విజయవాడలో కలెక్టర్ లక్ష్మీశ నుంచి అవార్డు అందుకుంటున్న వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు



కాకినాడలో కలెక్టర్ షాన్‌మోహన్ నుంచి అవార్డు అందుకుంటున్న కాకినాడ అర్బన్ తహశీల్దార్

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 27(ఆంధ్రజ్యోతి): భానుగుడి సెంటర్‌లోని సైన్ కంప్యూటర్ సెంటర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ జంగం బాబ్జీ తెలిపారు. స్టాండర్డ్ చార్టెడ్ కెరీర్ అకడమీ సీఎస్ఆర్ పథకంలో శిక్షణ ఇస్తామన్నారు. టాలీ, కంప్యూటర్ అసిస్టెంట్, రిటైల్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. 30 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 30వతేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9912300248, 9299907346 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ముగిసిన కుట్టుమిషన్ల శిక్షణ

తాళ్లరేవు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు క్రీమ్ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ల శిక్షణ ముగిసిందని సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న తాళ్లరేవు, జార్జిపేట, మెట్టకుర్రు ప్రాంతాలకు చెందిన 80మంది యువతులు, మహిళలకు సంస్థ ఆవరణలో సోమవారం ధ్రువపత్రాలు అందజేశారు. మరో బృందానికి శిక్షణ ప్రారంభమవుతుందని జట్పీటీసీ, సంస్థ నిర్వహకులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వెంకట నాగదుర్గాదేవి తెలిపారు.



పోరాట స్ఫూర్తిని నింపిన 'యువగళం'

పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర



యువగళం పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పాదయాత్ర నిర్వహిస్తున్న వర్మ

పిఠాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలనే మార్చివేసిన లోకేశ్ యువగళం పాదయాత్ర ద్వారా పార్టీ కేడర్‌లో పోరాట స్ఫూర్తిని నింపడంతో పాటు తెలుగుదేశం పార్టీని మరింత పటిష్టం చేయడానికి దోహదపడిందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో 3,132కిలోమీటర్ల మేర చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పిఠాపురంలో సోమవారం సాయంత్రం వర్మ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు భారీగా తరలివచ్చారు. మహిళలు పలుచోట్ల హారతులు ఇచ్చారు. యువకులు సంఘీభావం తెలిపారు. వర్మ మాట్లాడుతూ లోకేశ్ చేపట్టిన పాదయాత్రతో నాటి వైసీపీ ప్రభుత్వం, జగన్ వణికిపోయి దౌర్జన్యాలకు దిగడంతో పాటు పలు ఆటంకాలు కల్పించారని తెలిపారు. ప్రతి 20కిలోమీటర్లకు ఒక అక్రమ కేసు పెట్టారని చెప్పారు. 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2097 గ్రామాలు మీదుగా 226రోజులు పాటు పాదయాత్ర సాగిందని, ఇది ఒక రికార్డు అని తెలిపారు. ఈ పాదయాత్రతో రాష్ట్ర రాజకీయమే మారిపోయిందని, వైసీపీ అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిందని చెప్పారు. రాష్ట్రభవిష్యత్తు రథసారథి లోకేశ్ అని అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 5 రోజులు పాటు సాగిన లోకేశ్ పాదయాత్రకు అపూర్వ స్పందన లభించిందని గుర్తుచేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం లోకేశ్ అలుపెరగని కృషి చేస్తున్నారని దీంతో రాష్ట్రానికి రూ.6కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు.

కొంగోడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని వినతి

కరప, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ఎద్దడి నివారించేందుకు సగంలో ఆగిపోయిన కొంగోడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని, గొర్రిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫారమ్‌ల స్థానంలో కొత్తవి మంజూరుచేయాలని, వేములవాడ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వద్ద అదనపు మోటర్లను ఏర్పాటుచేయాలని కోరుతూ ఆయా గ్రామాల నాయకులు, రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలందజేశారు. కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, నాయకులు ఆయా గ్రామాల్లోని సాగునీటి ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గొర్రిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద రెండు ట్రాన్స్‌ఫారమ్‌ల ఏర్పాటుకు రూ.38.25లక్షలు అవసరమవుతాయని అధికారులు ఇచ్చిన ప్రతిపాదనల పత్రాన్ని గొర్రిపూడి నీటిసంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు కలెక్టర్‌కు అందజేసి నిధులు మంజూరుచేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆయా స్కీమ్‌ల వద్దకు వెళ్లి పూర్తి నివేదికను అందజేయాలని అప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో అధికారులు సోమవారం సాయంత్రం ఆయా గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితిపై నివేదికను రూపొందించారు. ఇరిగేషన్ డీఈ అనంతకుమార్, విద్యుత్‌శాఖ ఏడీఈ తుమ్మలపల్లి విష్ణుమూర్తి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.బాబూరావు, ఏవో ప్రశాంతి, లిఫ్ట్‌ఇరిగేషన్ డీఈ గురవయ్య, సురేంద్ర, జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, మేడిశెట్టి సుబ్బరాజు, మీసాల రాంబాబు, పుణ్యమంతుల అన్నవరం, యర్రంనీడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి అందజేసిన ఎమ్మెల్యే నానాజీ, గొర్రిపూడి, కొంగోడు, వేములవాడ నాయకులు

మల్టీ సర్వీస్ సెంటర్ ప్రారంభం

సర్పవరం జంక్షన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో సోమవారం లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ సభ్యులు వీఎస్ఆర్.మూర్తి, నాని, బాబ్జి చారిటబుల్, స్టార్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 316 మల్టీ సర్వీస్ సెంటర్‌ని లయన్స్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్, మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వేళ, నిరుపేదలకు ఏకష్టం వచ్చినా ము ందుండి ఆపన్న హస్తం అందించేది లయన్స్ క్లబ్ సభ్యులన్నారు. లయన్స్ క్లబ్ కార్యక్రమాల నిర్వహణ కోసం స్థలం విరాళం ఇచ్చిన దాత, భవన నిర్మాణానికి నిధులిచ్చిన సభ్యులను అభినందించారు. ఈ సెంటర్‌లో పలు శిక్షణ, సేవా కార్యక్రమాలకు వేదికగా వినియోగించుకోవచ్చన్నారు. క్లబ్ సభ్యుల కొప్పర్తిసాయి కృష్ణ సహకారంతో 10 మంది దివ్యాంగులకు వీల్‌చైర్లు, హెచ్ఐవీ బాధితులకు దుప్పట్లు, మొక్కల సంరక్షణ కోసం 15 ట్రీగార్డులు పంపిణీ చేశారు. అలాగే టైలర్ జీవనోపాధి కోసం రూ.10 వేలు విలువైన కుట్టుమిషన్ అందించారు. రోగుల సౌకర్యార్థం కాకినాడ జీజీహెచ్‌కు 2 స్ట్రక్చర్‌లను అందించారు. ఉమా మనోవికాస కేంద్రం విద్యార్థులకు నిత్యావసర సరుకులు, నిరుపేదలకు అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు మంజులూరి విశ్వేశ్వరరావు, రీజినల్ ఛైర్ పర్సన్ ఎం పద్మతులసి, జోన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ గరికిపర్తి నమశ్శివాయ, ఇంద్రగంటి శ్రీనివాస్, గరికిపర్తి నాగమణి, ఐ.ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా



పెద్దాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సాగులో ఉన్న కొండపోడు భూములకు గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. కొండపోడు భూములను గిరిజనులు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వారికి తక్షణమే పట్టాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో మాధవరావుకు వినతి పత్రాన్ని అందచేశారు. అర్జునుడు, బాబూరావు, రాజారావు, చెన్నయ్య పాల్గొన్నారు.

'సేవలే గుర్తింపునిస్తాయి'



డాక్టర్ విఠల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జీజీహెచ్(కాకినాడ), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పారదర్శకత, అంకిత భావం, అనుభవంతో విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని కాకినాడ జీజీహెచ్ మినిస్టీరియల్ సంఘం అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ నుంచి ఉత్తమ వైద్యుల అవార్డులు అందుకున్న జీజీహెచ్ ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌ను, ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్‌లను మినిస్టీరియల్ సంఘం సోమవారం ఘనంగా సత్కరించింది. రోడ్డు ప్రమాదాల్లో ఎముకలు విరిగిన క్షతగాత్రులకు, క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎంతోమంది రోగులకు ప్రత్యేకమైన వైద్యచికిత్స అందజేసి వారికి సాంత్వన చేకూరుస్తున్న వైద్యనిపుణులను సన్మానించి సత్కరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మూర్తిబాబు కొనియాడారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో జిల్లా సెక్రటరీ పేపకాయల వెంకటకృష్ణ, ఏడీ అనురాధ, మినిస్టీరియల్ సిబ్బంది వైఎస్ఎన్, కొండేపూడి శేఖర్, టీఎస్ఎల్ఎన్ మూర్తి, సుబ్రమణ్యం, రమేష్, కిషోర్, బేబీ, రాధాదేవి, కాశీ పాల్గొన్నారు.

సాగునీటి కోసం ఆందోళన

తాళ్లరేవు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండల పరిధిలోని పి.మల్లవరం శివారు గ్రాంటు భూములకు సాగునీరు అందక వరిచేలు ఎండిపోతున్నాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో సాగునీరు అందక సుమారు 30ఎకరాలు శివారు పంట పొలాలు బీటలు తీయడంతో సోమవారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సూరంపూడి శ్రీనివాస్, పిల్లి వీరనాగులు విలేకరులతో మాట్లాడుతూ తక్షణం అధికారులు స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. రైతులు బాదం ఏడుకొండలు, కుడుపూడి బాబీ, గుత్తుల రామకృష్ణా, మేడిశెట్టి శ్రీనివాస్, పిల్లి శ్రీను, నూకరాజు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

కాకినాడ క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ ట్రాఫిక్ వన్‌టౌన్ సీఐ ఎన్.రమేష్ సాంబమూర్తినగర్‌లోని ఏపీ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ విద్యార్థినులకు ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన నిర్వహించారు. ఏఎస్ఐ రామ్‌మోహన్, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో కొత్త ఎస్పీ ప్రత్యేక పూజలు



వేదాశీర్వచనం అందుకుంటున్న నూతన ఎస్పీ దంపతులు

సామర్లకోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన బిందుమాధవ్ సతీసమేతంగా సోమవారం ఉదయం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు ముందుగా ఆలయానికి చేరుకున్న ఎస్పీ దంపతులకు సాదరంగా స్వాగతం లపికారు, భీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి అమ్మవారి దర్శనం అనంతరం నందిమండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు,తదితర సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో సోమవారం పుష్యమాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, వెంకన్న, అంజిబాబుల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారికి విశేష అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు చేశారు. నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. నిత్యాన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో 800 మంది భక్తులకు, భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు



పుష్పాలంకరణలో రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మాసశివరాత్రి, మూలనక్షత్రం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో వేంచేసి ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకవార, ఏకాదశద్రవ్య రుద్రాభిషేకాలు నిర్వహించారు. 11 రకాల అభిషేక ద్రవ్యాలు, 11రకాల పళ్లరసాలతో స్వామిని అభిషేకించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఏకాదశ హారతులు సమర్పించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాలు నిర్వహించగా భక్తులు అధికంగా పాల్గొన్నారు. ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉచిత పశువైద్య శిబిరం

పెద్దాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని సోమవారం కాండ్రకోట పశుసం వర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎం.గంగాభవాని పర్యవేక్షణలో నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి పాడి రైతులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు మేడిది శ్రీనివాస్, ఏలేటి సుబ్బారావు, సత్తిబాబు, అడపా గంగాధర్, బొడ్డు రుద్రరావు, భువనాశి గంగాధర్, అల్లు రాజుబాబు, శేఖర్ గోపాలమిత్ర కొంగర శరత్ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్స్ డే వేడుకలు

పెద్దాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎలక్ట్రీషియన్స్ డే వేడుకలు ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ఎలక్ట్రికల్ వర్కర్స్ భారీ ర్యాలీ చేశారు. స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ, దారపురెడ్డి క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు తదితరులున్నారు.

నేడు పిఠాపురం మున్సిపల్ బడ్జెట్, అత్యవసర సమావేశాలు

పిఠాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం మంగళవారం జరుగుతుందని కమిషనర్ కనకారావు తెలిపారు. బడ్జెట్ సమావేశం అనంతరం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశాల్లో 2024-25 అంచనా, 2023-24 సవరించిన బడ్జెట్‌లతో పాటు అజెండాలోని అంశాలను చర్చించి ఆమోదించడం జరుగుతుందని వివరించారు. సమావేశాలకు కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు కిశోర వికాసం సదస్సు

సామర్లకోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సామర్లకోట లయన్స్ క్లబ్ ఆవరణలో మంగళవారం కిశోర వికాసం సదస్సు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో జీ.ఉషా తెలిపారు. కిశోర బాలికలు యుక్త వయస్సులో ఎదుర్కొనే సమస్యలు, పోక్సో చట్టం, పలు అంశాలపై వివరిస్తారని ఆమె చెప్పారు.

డీటీసీపీవోగా రాజు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళిక అధికారిగా ఎస్.రాజు బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన గుంటూరు జిల్లా నుంచి బదిలీపై విచ్చేస్తున్నారు. ఇప్పటివరకు డీటీసీపీవోగా విధులు నిర్వహించిన ఎ.సత్యమూర్తి ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బదిలీ అయ్యారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 105 అర్జీలు

రంపచోడవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 105 ప్రజల నుంచి అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, ఏపీవో (జీ) డీఎన్వీ రమణలతో కలిసి అర్జీలు స్వీకరించారు. రోడ్లకు అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయాలని, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించాలని కోరుతూ అధికంగా దరఖాస్తులు అందాయన్నారు. డిప్యూటీ డైరెక్టర్లు ఎ.విజయశాంతి, పరీఫ్, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం వెంకట ఇందిర, ఏడీఎంహెచ్‌వో శిరీష, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, గాబ్రియేలు, రవికుమార్, డీఎల్డీవో కోటేశ్వరరావు, తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసుదొర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న స్కీమ్ వర్కర్లు

'స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి'

రంపచోడవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగులో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్కీమ్ వర్కర్లు ఐటీడీఏ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మట్ల వాణిశ్రీ, పి.వెంకట్ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ, ఆశ వర్కర్లు, స్కూల్ శానిటేషన్ కార్మికుల సమస్యలను ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తొలుత సీఐటీయూ కార్యాలయం నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు కె.శాంతిరాజు, అంగన్వాడీ హెల్పర్ల యూనియన్ నాయకులు బి.నిర్మల, కె.రామలక్ష్మి, కె.రాణి, కె.వెంకటలక్ష్మి, ప్రసన్న, ఆశా యూనియన్ నాయకులు కలింకోట రమణమ్మ, కొమర చెల్లాయమ్మ, ఎస్.మంగాయమ్మ, ఎస్.వెంకటలక్ష్మి, శానిటేషన్ యూనియన్ నాయకులు కె.విజయకుమారి, పి.కుమారి, చోడి లక్ష్మి, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఎమ్మెల్యే శిరీషదేవి



ఆయాలకు నియామక పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతమైందని, రాష్ట్రానికి పెట్టుబడులే ధ్యేయంగా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించేందుకు బిల్‌గేట్స్, టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారన్నారు. ఇప్పటికే 50 కంపెనీలు రూ.5లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టుబడులు పెట్టడం రాష్ట్రానికి శుభపరిణామన్నారు.

రంపచోడవరం డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 37 అంగన్వాడీ ఆయా పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా నియామకాలు పొందిన ఆయాలు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణిలకు పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవోలు డి.సంధ్యారాణి, లక్ష్మి, ప్రసన్న, సుధా, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, టీడీపీ నాయకులు అనంతమోహన్, అడబాల బాపిరాజు, బీజేపీ నాయకులు వీరబాబు, కారు లక్ష్మి, పెంటమ్మ, సత్యవతి, సూపర్‌వైజర్లు పావని, ఈశ్వరి, రాఘవ, సత్యవతి, సీత, సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణ



మహిళలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

మోతుగూడెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సివిక్స్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మోతుగూడెం సీఆర్పీఎఫ్ ఎ/42 బెటాలియన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కమాండెంట్ ధర్మప్రకాష్ ఆదేశాల ప్రకారం ఇన్‌స్పెక్టర్ గణేష్ సహన ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. మోతుగూడెం, ఫోర్‌బై, ఇంతలూరు వాగు, రాజు క్యాంప్ గ్రామాలకు చెందిన 11 మంది ఎస్సీ, ఎస్టీ మహిళలను శిక్షణకు ఎంపిక చేశారు. వారికి సోమవారం ఇన్‌స్ట్రక్టర్ అరుణకుమారి శిక్షణ వచ్చే నెల 28వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తరగతులు జరుగుతాయి. కార్యక్రమంలో మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ, హెడ్ కానిస్టేబుల్, సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ ఎ/42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

సర్వే నిర్వహించారు... పునరావాసం మరిచారు...

కూనవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగూడెం గ్రామానికి పోలవరం సర్వే నిర్వహించి పునరావాసంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ గ్రామంలో మొత్తం 60కి పైగా కుటుంబాలు ఉన్నాయి. 19.10.2022న ఆ గ్రామానికి సంబంధించి దినపత్రికల్లో నోటిఫికేషన్ సైతం విడుదల చేశారు. నోటిఫికేషన్ అనంతరం ఆగ్రామంలోని ఇళ్లకు స్ట్రక్చర్ వాల్యూయేషన్ సైతం అధికారులు వేశారు. ఆ గ్రామానికి సంబంధించి పోలవరం గ్రామసభ సైతం నిర్వహిస్తామని అక్కడి నిర్వాసితులకు తెలిపారు. రెండుసార్లు సభను వాయిదా వేశారు. కానీ నేటికీ తమను పట్టించుకోలేదని ఆ గ్రామానికి చెందిన నిర్వాసితులు అంటున్నారు. గోదావరి నీటిమట్టం 55 అడుగులు రాగానే ఆ గ్రామం ముంపునకు గురికావడమే కాకుండా చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములు సైతం నీటమునుగుతాయి. తమకు పునరావాసం కల్పిస్తామని అధికారులు చెప్పినప్పటికీ సర్వేలు నిర్వహించి పట్టించుకోవట్లేదంటున్నారు. అల్లూరి జిల్లా కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవో తక్షణం చర్యలు తీసుకోవాలని మర్రిగూడెం పోలవరం నిర్వాసితులు కోరుతున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం





సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, హాజరైన కౌన్సిలర్లు

ఏలేశ్వరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. సోమవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలో అంశాలను సీనియర్ అసిస్టెంట్ శేషు కుమార్ చదివి వినిపించారు. నగర పంచాయతీ పరిధిలో 15 ఫైనాన్స్ నిధులు రూ.76 లక్షలతో కల్వర్టు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టేందుకు సమావేశంలో ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. చైతన్య నగర్, కప్పలచెరువు దగ్గర శ్మశానవాటిక వద్ద ఉన్న డంపింగ్ యార్డు అధ్వానంగా ఉండంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చెత్తను తొలగించాలని కౌన్సిలర్ బదిరెడ్డి గోపి కోరారు. శివరాత్రి ఏర్పాట్లలో భాగంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా స్థానిక మార్కెట్ వద్ద రోడ్డు భాగాన్ని చదును చేయాలని కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా 1వ సచివాయం నుంచి 9వ సచివాలయాల పరిధిలో డ్రైనేజీల్లో పూడిక తీత పనులకు ఆమోదం తెలియజేశారు. మహాశివరాత్రికి ఏలేరు నదీతీరాన తాత్కాలికంగా టెంట్లు ఏర్పాటు, విద్యుత్, తాగునీరు సదుపాయం కోసం సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి సమావేశంలో తీర్మానించారు. కమిషనర్ సత్యరాయణ, వైస్ చైర్‌పర్సన్‌లు మనిరపు బుజ్జి, శిడగం త్రివేణి, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, సామంతుల హైమావతి, సుంకర హైమావతి, యండగుడి నాగబాబు, రాయుడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు విశేష కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

ప్రత్తిపాడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లు విశేషంగా కృషి చేస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముందు చూపుతో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) శిఖరాగ్ర సదస్సు కోసం దావోస్ వెళ్లిన సీఎం చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎందరో ప్రముఖ కంపెనీల అధిపతులతో సమావేశమై వారు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకున్నారని ఆమె చెప్పారు. పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు ఇచ్చిన భరోసా మేరకు భారీ ఎత్తున రాష్ట్రానికి కంపెనీలు తరలి రానున్నాయన్నారు. చంద్రబాబు, లోకేశ్ కృషితో రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేయడానికి అవకాశం కలిగిందన్నారు. దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి రూ.6లక్షల కోట్ల విలువైన పరిశ్రమలు తీసుకు రావడంలో చంద్రబాబు, లోకేశ్‌ల కృషి అభినందనీయమన్నారు.

30పడకల ఆసుపత్రి అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే దివ్య



కోటనందూరులో పీహెచ్‌సీ ల్యాబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

కోటనందూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో కోటనందూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 30పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. సోమవారం కోటనందూరు ఆరోగ్య కేంద్రంలో రూ.50లక్షలతో నిర్మించిన ల్యాబ్ భవనాన్ని, మినీ గోకులాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అలాగే కోటనందూరు మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే రూ.5 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేశామన్నారు. తాండవ వంతెనపై మినీవంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, డి.చిరంజీవిరాజు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, యనమల భాస్కరరావు, అంకంరెడ్డి రమేష్, వెలగా వెంకట కృష్ణారావు, చింతకాయల రవికుమార్, షేక్‌నవాబ్‌జానీ, పి.సూరిబాబు, చిన సత్యనారాయణ, అంకంరెడ్డి బుల్లిబాబు, మేరపురెడ్డి జోగిబాబు, జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్, డాక్టర్ యామిని, ఎంపీడీవో వెంకటనారాయణ, తహశీల్దార్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యాధికారిణికి సత్కారం

ఏలేశ్వరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవా అవార్డు గ్రహీత డాక్టర్ శైలజను కౌన్సిలర్లు సత్కరించారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య రంగంలో సేవ చేస్తూ ఉత్తమ పురస్కారం అందుకున్న వైద్యాధికారిణి జీఎస్ఎస్‌కే శైలజను వైస్ చైర్‌పర్సన్‌లు మనిరపు బుజ్జి, శిడగం త్రివేణి, కౌన్సిలర్లు సామంతుల హైమావతి, బదిరెడ్డి గోవింద్, సుంకర హైమావతి, బదిరెడ్డి వెంకటరమణమ్మ, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్ పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎంపీడీవో బుజ్జికి సత్కారం

గండేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారం అందుకున్న గండేపల్లి ఎంపీడీవో నాతి బుజ్జిని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, మండల స్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

శంఖవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి సెంటర్‌లో జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీధర్ ఆదేశాల మేరకు కత్తిపూడి రవాణాశాఖాధికారి బి.శ్రీనివాస్ అధ్వర్యంలో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కాకినాడ ఆర్టీవో శివారెడ్డి మాట్లాడుతూ కారు ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్వేతసాయి, రోడ్డు సేఫ్టీ పోలీస్‌లు, హీరో, టీవీఎస్‌షోరూమ్ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటుదాం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జగ్గంపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సాహితీ పబ్లిక్ స్కూల్ వద్ద సోమవారం బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణ వర్మ అధ్యక్షతన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై బీజేపీ అనుచిత వ్యాఖ్యలు చేసిందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను ఏనాడు గౌరవించలేదని విమర్శించారు. బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ అధ్యక్షుడు దాట్ల కృష్ణవర్మ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి ప్రజలందరికీ ఎప్పుడో అర్థమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, మట్ట మంగరాజు, డీవీఎస్ రాజు, వత్సవాయి వరాల బాబు, బీజేపీ జగ్గంపేట, గండేపల్లి, గోకవరం మండలా అధ్యక్షులు పల్లారాము, తోరాటి వెంకన్న, ఇనకోటి బాపన్న దొర, కోకన్వీనర్ కోన సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, నుంచి భారీ సంఖ్యలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం



అన్నా క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద మూడేళ్లుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్‌ను ఈవారం టీడీపీ గోకవరం మండల నాయకుల ఆర్థిక సహాయంతో నిర్వహిస్తారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సోమవారం పేదలకు అన్నం వడ్డించారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలని టీడీపీ నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్ కార్యక్రమం స్ఫూర్తితో జగ్గంపేటలో మూడేళ్లుగా దాతల సహకారంతో పేదలకు అన్నదానం చేస్తున్నామ న్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, జాస్తి వసంత్, భూపాలపట్నం ప్రసాద్, రాయిసాయి, బద్ది సురేష్, కోడూరి రమేష్, ఎండీ కాజా, గారపాటి మధు, ముక్కపాటు బాబు, గుడివాడ శివ, గెడ్డం కృష్ణమోహన్, ప్రేమ, స్వరూప్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

100గ్రాముల బంగారం స్వాధీనం

కోటనందూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బిళ్లనందూరు గ్రామంలో ఈనెల24న మాతిరెడ్డి గంగయ్యమ్మ ఇంట్లో జరిగిన దొంగతనం చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేశామని తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు తెలిపారు. గ్రామానికి చెందిన బొత్స వీరబాబు ఈనెల 24న గంగయ్యమ్మ ఇంటికి వెళ్లి ఎవరూ లేని సమయంలో తాళంపగలగొట్టి బీరువాను తెరిచి 100గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించాడు. గంగయ్యమ్మ ఫిర్యాదుతో 26న తాటిపాక సెంటర్‌లో వీరబాబును ఎస్ఐ టి.రామకృష్ణ సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. అతడి వద్ద నుంచి వంద గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టుకు తరలించామని తెలిపారు.

కొట్లాట కేసులో వ్యక్తి అరెస్టు

కోటనందూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో అన్నదమ్ముల మధ్య జరిగిన కొట్లాటలో వ్యక్తిని అరెస్టు చేశామని తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు తెలిపారు. మిర్యాల నాగుకు, చమిర్యాల నానాజీకి ఇంటి నిర్మాణం విషయంలో ఘర్షణ తలెత్తింది. దీంతో నానాజీని కర్రతో నాగుకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నాగును కోర్టుకు తరలించామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

తేటగుంటలో టీడీపీ శ్రేణుల సంబరాలు



పాదయాత్ర పైలాన్ వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర తుని నియోజకవర్గంలో 3000కిలో మీటర్లు పూర్తయిన సందర్భంగా తేటగుట్ట వద్ద పైలాన్ ఆవిష్కరించారు. పైలాన్ ఆవిష్కరించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యనమల దివ్య పైలాన్ వద్ద భారీ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు స్వీట్లు పంచారు. యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బా యి, యనమల లక్ష్మణరావు, పప్పు నవీన్, దం తులూరి శ్రీనివాసరాజు,గజ్జి అప్పలరాజు, జక్కన రామునాయుడు, రొంగల అబ్బు, తమరాన సత్యనారాయణ, చామంతి సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. హంసవరంలో రూ.45లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో గోకులాన్ని ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, తుని నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు దివ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీపీ బొప్పన రాము, కుర్ర వెంకటరమణ, దాసరి ఈశ్వరరావు, జనసేన నాయకులు చోడిశెట్టి గణేష్, కాపారపు అబ్బులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

చిన్నారుల ఆధార్ నమోదు చేయాలి

గండేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఆరేళ్లలోపు ఆధార్‌లేని పిల్లల వివరాల నమోదు కోసం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లకు, అంగన్వాడీ టీచర్లకు ఎంపీడీవో నాతి బుజ్జి సమావేశం నిర్వహించారు. ఆధార్‌కార్డులేని పిల్లలకు ఆధార్ శిబిరాల ద్వారా కొత్తగా ఎన్‌రోల్ చేయాలన్నారు. ఆధార్ ఉన్నవారికి ఆధార్‌నెంబరును ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలన్నారు.

ఎంపీడీవోకు అభినందనల వెల్లువ

తుని రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఎంపీడీవోగా పురస్కారం అందుకున్న కె.సాయినవీన్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం మండల పరిషత్ సిబ్బందితో పాటు ఎంపీపీ ఆయనను ఎంపీడీవో కార్యాలయంలో సత్కరించారు.

ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ సాయం

శంఖవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పేదలకు సహాయం చేయడానికే ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశామని ట్రస్ట్ ఛైర్మన్, ప్రత్తిపాడు నియో జకవర్గ వైసీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. పెద మల్లాపురం పంచాయితీ శృంగధార గ్రామంలో ఇటీవల కాలంలో కాకర సత్య నారాయణ మనవుడు మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ఐదువేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో పెదమల్లారం, బోరువాక, గౌరంపేట, వేళంగి సర్పంచ్‌లు గుండునాగదేవి చెంచుబాబు, మేకల సుబ్బలక్ష్మి సత్యనారా యణ, దిడ్డి సత్యనారాయణ, రామిశెట్టి యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుపై హర్షం

రౌతులపూడి, జనవరి27(ఆంధ్రజ్యోతి): మూలగపూడి గ్రామానికి చెందిన పస గడుగుల రమణకి విద్యుత్‌మీటర్ రీడింగ్‌లో ఉత్తమ అవార్డు రావడంపై జగ్గం పేట డివిజన్ యూనియన్ అధ్యక్షుడు పసగడుగు నానాజీ, సెక్రటరి సతీష్, పసగడుగల నూకరాజు, కేవీ చలం బేరా శ్రీను, తోట ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు, కోటనందూరు సెక్షన్‌లో మీటర్‌రీడర్‌గా పనిచేస్తున్నాడు.

అరుణాచలేశ్వరునికి అభిషేకాలు





ప్రత్తిపాడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాచపల్లిలో గల అరుణాచలేశ్వరునికి సోమవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రమణ సేవా ఆశ్రమానికి చెందిన స్వామి రామానంద ఆధ్వర్యంలో వేదపండితులు అరుణాచలేశ్వరునికి పాలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూలతో స్వామివారిని అలంకరించి పూజలు నిర్వహించారు. తర్వాత పంచ హారతులు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

గండేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సింగరంపాలెం శివారున పేకాట శిబిరంపై ఎస్ఐ యువి శివనాగబాబు దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. రూ.3580 స్వాధీనంచేసుకున్నారు.

పది లీటర్ల సారా స్వాధీనం

గండేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): యల్లమిల్లి గ్రామానికి చెందిన టి.అప్పారావు యల్లమిల్లి గ్రామ శివారున సారా తయారుచేస్తుండగా ఎస్ఐ శివనాగబాబు దాడి చేసి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అక్కడున్న 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించారన్నారు.

'ఆదిత్య'లో నేడు మెగా రక్తదాన శిబిరం

గండేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో మంగళవారం ఆదిత్య వ్యవస్థాపక సభ్యులు, ఆదిత్య విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ నల్లమిల్లి లక్ష్మీరాజ్యం జన్మదినం (ఆదిత్య వ్యవస్థాపక దినోత్సవం-ఫౌండర్స్ డే)సందర్భంగా మెగా రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాకినాడ, రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో రక్తం సేకరిస్తారు. ఆదిత్య అధినేతలు డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులకు మద్దతు

ప్రత్తిపాడు, జనవరి27(ఆంధ్రజ్యోతి):ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రుల పీడీ ఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులకు రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ మద్దతు ఇస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం తెలిపారు. ధర్మవరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేసిన వ్యక్తి రాఘవులని అన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అర్జీ

గండేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ఒక అర్జీ వచ్చినట్లు ఎంపీడీవో నాతి బుజ్జి తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కె.చంద్రశేఖర్, ఎంఈవో నాయక్, హౌసింగ్ ఏఈ బి.రాంబాబు పాల్గొన్నారు.